# అంబేద్కర్‌కు ఘన నివాళి

- వాడవాడలా రాజ్యాంగపిత వర్ధంతి
- విగ్రహాలు, చిత్రపటాల వద్ద నాయకులు, ప్రజాప్రతినిధుల నివాళి
- ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిన
- సిరిసిల్ల, కరీంనగర్‌లో మాజీ మంత్రులు కేటీఆర్, గంగుల..
- కోరుట్లలో ఎమ్మెల్యే సంజయ్, మంథనిలో పుట్ట మధూకర్, గంగాధర మండలం బూరుగుపల్లిలో సుంకె రవిశంకర్



మంథనిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

జగిత్యాలడిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజ్యాంగ ప్రదాత, మహనీయుడు బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నివర్గాల హక్కుల కోసం పరితపించిన అంబేద్కర్ అందరివాడని కొనియాడారు. రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలోని తెలంగాణ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి మాజీ మంత్రి కేటీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తావద్ద గల అంబేద్కర్ విగ్రహానికి మాజీ మంత్రి గంగుల కమలాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కోరుట్లలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మంథనిలో పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య ఎల్లారెడ్డిపేటలో, చొప్పదండి నియోజకవర్గంలోని గం గాధర మండలం బూరుగుపల్లి మధురానగర్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మానకొండూర్‌లో కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కరీంనగర్ బల్దియా కార్యాలయం వద్ద మేయర్ సునీల్‌రావు, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఎన్నారై పార్టీ ప్రతినిధుల భేటీ



కేసీఆర్‌తో రాధారాపు సతీశ్ కుమార్

కోరుట్ల, డిసెంబర్ 6: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రం లో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ కూర్మాచలం ఆధ్వర్యంలో కోరుట్లకు చెందిన ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్ కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ గెలుపు కోసం చేసిన కృషిని కేసీఆర్‌కు వివరించగా అభినందించారన్నారు. భవి ష్యత్‌లోనూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారని పేర్కొన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు

**విజేతగా నిలిచిన వరంగల్ జట్టు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మహబూబ్‌నగర్, అదిలాబాద్, నాలుగో స్థానంలో కరీంనగర్**



విజేత జట్టుకు ట్రోఫీని ప్రదానం చేస్తున్న రాష్ట్ర జూడో సంఘం కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి

సుల్తానాబాద్, డిసెంబర్ 6: పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ జూడో పోటీలు బుధవారం ముగిశాయి. వరంగల్ జట్టు చాంపియన్‌షిప్ సాధించింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో మహబూబ్ నగర్, అదిలాబాద్ జట్లు నిలువగా, నాలుగోస్థానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు నిలించింది. రెండు రోజులుగా సాగిన ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నామని జూడో అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. తెలిపారు. ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటారు. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర జూడో సంఘం కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ముగింపు కార్యాక్రమానికి హజరై గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు జూడో క్రీడకు అదరణ పెరుగుతుందన్నారు. పెద్దపల్లి జి ల్లాలో జూడో అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భారత జూడో సంఘం కోశాధికారి కైలాస్ యా దవ్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, హైదరాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీనియర్ ఖోఖో క్రీడాకారుడు బోడ్డుపల్లి ఉపేంద్రం, జూడో సంఘం చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు మాటేటి సంజీవ్, ప్ర ధాన కార్యదర్శి సిలివేరి మహేందర్, సాయిరి మహేందర్, ఎల్‌వీ రమణ, పెటా కార్యదర్శి వే ల్పుల సురేందర్, అంతర్జాతీయ ఖోఖో క్రీ డాకారుడు గెల్లు మధూకర్, ఇండియన్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, నోముల శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ కిషోర్, అమిరిశెట్టి తిరుపతి, బిట్రా శ్రీనివాస్, ఎండీ యూనస్‌పాష, అంతటి శంకరయ్య, దాసరి రమేశ్, బాలసాని రాజ్‌కుమార్, అలేటి సంపత్, పీఈటీలు ఇక్బాల్, శివ, సత్యం పాల్గొన్నారు.

## నేడు స్క్రీనింగ్ పరీక్ష

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 6: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జపాన్‌లో ఉద్యోగాల కోసం ఈనెల 7న బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం డిప్లొమా చేసిన అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవేందర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హైదరాబాద్‌లోని విద్యానగర్ శివంరోడ్డులో గల ఎన్ఎస్‌టీఐలో నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని సూచించారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు జపనీస్ భాషలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తయిన వారికి నెలకు రూ. 1.50 లక్షల నుంచి రూ. 1.80 లక్షల వరకు వేతనం ఉంటుందన్నారు. వి వరాలకు సెల్ నంబర్ 8919047600, 6302292450లో సంప్రదించాలని సూచించారు.

## జాతీయ ఖోఖో కోచ్‌గా పీఈటీ రాజశేఖర్

కోనరావుపేట, డిసెంబర్ 6: మండలంలోని కనగర్తి జిల్లా పరిషత్ పాఠశా లలో పనిచేస్తున్న పీఈటీ రాజశేఖర్ జాతీయ ఖోఖో కోచ్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన పంజాబ్‌లో ఆరు వారాల పాటు జాతీయ జట్టుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పీఈటీని సర్పంచ్ అనుపాటి భారతి, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి తదితరులు అభినందించారు.

## విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 6: ఇంటిపై పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి పదిహేను సంవత్సరాల బాలుడు మృతిచెందినట్లు జగిత్యాల టౌన్ ఎస్ఐ అబ్దుల్ రహీం తెలిపారు. జగిత్యాల పట్టణానికి చెందిన అయాన్ అలీ(15) ఓ వ్యక్తి వద్ద టెంట్‌హౌస్, డెకరేషన్ పనులు చేస్తుంటాడు. పనిలో భాగంగా గణేశ్‌నగర్‌లో బుధవారం ఓ ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి ఇంటి డాబాపై టెంట్ వేస్తుండగా, టెంటు వేసేందుకు వినియోగించిన ఇనుప పైపు ఇంటి పక్కనే ఉన్న కరెంట్ వైరుపై పడింది. అయాన్ అలీకి విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి శిరీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ రహీం తెలిపారు.

# రాజన్న భక్తులపై జీఎస్టీ భారం

- సామాన్య భక్తులపై జీఎస్టీ భారం
- వంద రూపాయల గదికి ₹12 వడ్డింపు



రాజన్న అద్దె గదుల పెంచిన ధరల బోర్డు

వేములవాడ/వేములవాడటౌన్, డిసెంబర్ 6: వేములవాడ రాజన్న ఆలయ వసతిగృహ సముదాయాల అద్దె గదుల ధరలను దేవాదాయ శాఖ అధికారుల అనుమతితో పెంచినట్లు ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. అయితే గతం లో వెయ్యి దాటిన అద్దె గదికి మాత్రమే జీఎస్టీ పన్ను ఉండగా, ప్రస్తుతం వంద రూపాయల గదికి కూడా 12 రూపాయల జీఎస్టీని వసూలు చేస్తుండగా, సామాన్య భక్తులపై భారం పడనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దె గదుల ధరలను స్వల్పంగా పెంచినప్పటికీ, జీఎస్టీ భారం మాత్రం అధికంగానే భక్తులపై పడుతున్నది. కేవలం భీమేశ్వర సదన్‌లో ధరలు మాత్రం యథావిధిగా ఉండ గా, విగతా వాటి ధరలు మాత్రం పెరిగాయి.

| అతిథిగృహం పేరు | పాత ధర | పెంచినది | జీఎస్టీ | ప్రస్తుత ధర |
|---|---|---|---|---|
| భీమేశ్వరఅతిథి గృహం | ₹2,200 | ₹300 | ₹300 | ₹2,800 |
| నందీశ్వర సూట్ | ₹2,200 | ₹300 | ₹300 | ₹2,800 |
| అమ్మవారి అతిథిగృహం | ₹వెయ్యి | ₹500 | ₹1,80 | ₹1,680 |
| నందీశ్వరలో నాన్‌ఏసీ | ₹350 | ₹150 | ₹60 | ₹560 |
| పార్వతీపురం బ్లాకు | ₹500 | ₹100 | ₹72 | ₹672 |
| పార్వతిపురం వసతిగది | ₹200 | ₹100 | ₹36 | ₹336 |
| లక్ష్మీగణపతి కాంప్లెక్స్ | ₹250 | ₹150 | ₹48 | ₹448 |
| శంకరపురం ధర్మశాల | ₹50 | ₹50 | ₹12 | ₹112 |

# అంజన్న హుండీ @ ₹48.83లక్షలు



హుండీలోని నగదును లెక్కిస్తున్న భక్తులు

మల్యాల, డిసెంబర్ 6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిదానంలోని ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లోని 11 హుండీలను బుధవారం లెక్కించగా, 48లక్షల83వేల262 రూపాయల నగదు సమకూరిందని ఆలయ ఈవో టంకశాల వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం సమకూరిన నగదు 28రోజులదని చెప్పారు. అలాగే స్వామి వారికి 0.8 గ్రాముల బంగారం, 2.6కిలోల వెండి, 56నోట్ల విదేశీ కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ, ఇన్‌స్పెక్టర్లు జెమిని శ్రీనివాస్, సంపత్, సిబ్బంది ధర్మేంధర్, యాదగిరి, బండ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసచారి, సురేందర్‌రెడ్డి, ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్, రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు , ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన




విద్యార్థులకు ఆఫర్ లెటర్ అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి , కంపెనీ ప్రతినిధులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 6: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన వచ్చింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ, జాబ్ మేళాలో పదికిపైగా ఎంఎన్‌సీ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేసినట్లు తెలిపారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ, 180 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగా, 25 మందిని సెలెక్ట్ చేసి ఆఫర్ లెటర్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పవిత్ర, శివ ప్రశాంత్, దివ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.